


04లో

## మహిళా సంఘాల నిధుల్లో మాయాజాలం!

- కేటీ దొడ్డిలో నిబంధనలకు విరుద్ధంగా లక్షల నగదు డ్రా చేసినట్లు ఆరోపణలు
- ఏపీఎం,అకౌంటెంట్ తీరుపై అనుమానాలు-సమగ్ర విచారణకు మహిళా సంఘాల సభ్యుల డిమాండ్

జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట
01 మంగళవారం, సెప్టెంబర్ 2026 పేజీలు:17

# పెండింగ్ దరఖాస్తులపై మంత్రి ఫోకస్

## నిర్లక్ష్యాన్ని సహించేది లేదు.. అక్రమణదారులపై ఆర్ఆర్ యాక్ట్ ప్రకారం చర్యలు

### రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



**వీపనగండ్ల, ప్రజా జ్యోతి రిపోర్టర్ :**

ప్రజల ఫిర్యాదులు, అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని, ప్రతి ఫిర్యాదును వారం రోజుల గడువులో పరిష్కరించాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజలు తమ అర్జీలు, దరఖాస్తులను మంత్రి కార్యాలయానికి సంబంధించిన 81858 85127 వాట్సాప్ నంబర్‌కు కూడా పంపవచ్చని తెలిపారు. ప్రజలు సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని మంత్రి అన్నారు. కోర్టు పరిధిలో ఉన్న సమస్యలు మినహా ప్రతి ఫిర్యాదును వారం రోజుల్లో పరిష్కరించి, తీసుకున్న చర్యలను అర్జీదారులకు లిఖితపూర్వకంగా తెలియజేయాలని సూచించారు. నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. చెరువులు, ప్రభుత్వ భూముల అక్రమణలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, అక్రమణదారులపై ఆర్ఆర్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపాధి హామీ పనుల్లో మానవ దినాల లక్ష్యాలను పెంచాలని, ఉత్తమ పనితీరు కనబరిచే పంచాయతీ కార్యదర్శులను ప్రోత్సహిస్తామని తెలిపారు. సింగోటం గోపాల్ దిన్నె నీటిపారుదల ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణను త్వరగా పూర్తి చేయాలని సూచించారు.వీపనగండ్ల మండలానికి కేటాయించిన 375 ఇందిరమ్మ ఇళ్లలో ఇంకా 54 మంది లబ్ధిదారుల ఎంపిక పెండింగ్‌లో ఉండటంపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. రెండు మూడు రోజుల్లో ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలు ప్రత్యేక దృష్టి సారించి, అవసరమైన పత్రాలను సమర్పించి ఓటు తుది జాబితాలో ఉండేలా చూసుకోవాలని సూచించారు.

మిగతా 2 లో

# పెండింగ్ దరఖాస్తులపై మంత్రి ఫోకస్.

మొదటిపేజీ తరువాయి

## నిర్లక్ష్యాన్ని సహించేది లేదు.. అక్రమణదారులపై ఆర్ఆర్ యాక్ట్ ప్రకారం చర్యలు

## రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

**వీపనగండ్ల, ప్రజా జ్యోతి రిపోర్టర్ :**

ప్రజల ఫిర్యాదులు, అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని, ప్రతి ఫిర్యాదును వారం రోజుల గడువులో పరిష్కరించాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజలు తమ అర్జీలు, దరఖాస్తులను మంత్రి కార్యాలయానికి సంబంధించిన 81858 85127 వాట్సాప్ నంబర్‌కు కూడా పంపవచ్చని తెలిపారు. ప్రజలు సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని మంత్రి అన్నారు. కోర్టు పరిధిలో ఉన్న సమస్యలు మినహా ప్రతి ఫిర్యాదును వారం రోజుల్లో పరిష్కరించి, తీసుకున్న చర్యలను అర్జీదారులకు లిఖితపూర్వకంగా తెలియజేయాలని సూచించారు. నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. చెరువులు, ప్రభుత్వ భూముల అక్రమణలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, అక్రమణదారులపై ఆర్ఆర్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపాధి హామీ పనుల్లో మానవ దినాల లక్ష్యాలను పెంచాలని, ఉత్తమ పనితీరు కనబరిచే పంచాయతీ కార్యదర్శులను ప్రోత్సహిస్తామని తెలిపారు. సింగోటం గోపాల్ దిన్నె నీటిపారుదల ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణను త్వరగా పూర్తి చేయాలని సూచించారు.వీపనగండ్ల మండలానికి కేటాయించిన 375 ఇందిరమ్మ ఇళ్లలో ఇంకా 54 మంది లబ్ధిదారుల ఎంపిక పెండింగ్‌లో ఉండటంపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. రెండు మూడు రోజుల్లో ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలు ప్రత్యేక దృష్టి సారించి, అవసరమైన పత్రాలను సమర్పించి ఓటు తుది జాబితాలో ఉండేలా చూసుకోవాలని సూచించారు.

### ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యంపై మంత్రి ఆగ్రహం

ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో జరుగుతున్న జాప్యంపై రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.వీపనగండ్లకు చెందిన బీచుపల్లి గౌడ్ తన భూమి సర్వే సమస్యపై ఫిర్యాదు చేసినప్పటికీ పరిష్కారంలో జాప్యం జరగడంపై అసంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి, బాధ్యులైన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్‌ను ఆదేశించారు.అలాగే కల్వరాల గ్రామంలోని సర్వే నంబర్ 1లో ప్రభుత్వ భూమి ఆక్రమణపై ఫిర్యాదు రావడంతో, మొత్తం భూమిని సమగ్రంగా సర్వే చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన స్థలాన్ని క్రీడా మైదానానికి కేటాయించి, మిగిలిన స్థలంలో అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వినోద్ కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిరుపతయ్య, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, జెడ్పీ సీఈవో యాదయ్య, స్థానిక సర్పంచ్ పార్వతమ్మ, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.






# నూతన గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు సరితా తిరుపతయ్య

**గద్వాల ఆగస్టు 31(ప్రజా జ్యోతి ప్రతినిధి):**

గద్వాల నియోజకవర్గ పరిధిలోని ఈడిగోనిపల్లి గ్రామంలో నిర్వహించిన నూతన గృహప్రవేశ కార్యక్రమంలో గద్వాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సరితా తిరుపతయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూజా కార్యక్రమాల్లో పాల్గొని నూతన గృహ యజమానులకు శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా,నియోజకవర్గ నాయకులు పెద్దపల్లి అల్వాల రాజశేఖర్ రెడ్డి,జైపాల్ రెడ్డి,ఆనంద్ గౌడ్,ఈడిగోనిపల్లి సర్పంచ్ రమేష్, ఇమాన్యుయేల్, చింతలకుంట జనార్ధన్,కృష్ణ,కొండపల్లి ఈశ్వర్,అయ్యప్ప మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# విద్యార్థులకు ఉచిత ఏకరూప దుస్తుల పంపిణీ

**గద్వాల ఆగస్టు 31(ప్రజా జ్యోతి ప్రతినిధి):**

గద్వాల నియోజకవర్గంలోని పెద్దపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రాథమిక అందజేసిన ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అల్వాల శిరీష రాజశేఖర్ రెడ్డి విద్యార్థులకు దుస్తులు అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ అల్వాల శిరీష మాట్లాడుతూ,ప్రభుత్వం విద్యార్థుల కోసం ఉచితంగా అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.విద్యార్థులు క్రమశిక్షణతో చదువుపై దృష్టి సారించి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.పాఠశాల స్థాయి నుంచే విద్యపై ఆసక్తి పెంచుకోవాలని,ఉన్నతంగా చదివి భవిష్యత్తులో మంచి స్థాయికి చేరుకోవాలని అన్నారు.తద్వారా కన్న తల్లిదండ్రులతో పాటు గ్రామానికి కూడా పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని సూచించారు.కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జయలక్ష్మి, ఉపసర్పంచ్ లక్ష్మి నర్సింహా,వార్డు సభ్యుడు శివ,గ్రామస్తులు సువర్ణ,రమేష్,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





# మహబూబ్‌నగర్ జిల్లాలో సెక్షన్30 పోలీస్ యాక్ట్ అమలు

## - ముందస్తు అనుమతి లేకుండా ర్యాలీలు, ధర్నాలు, బహిరంగ సభలకు అనుమతి లేదు: ఎస్పీ డి. జానకి




**మహబూబ్‌నగర్, ఆగస్టు 31 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

జిల్లాలో శాంతిభద్రతలు, ప్రజా ప్రశాంతతను కాపాడేందుకు సెప్టెంబర్ 1 నుంచి సెప్టెంబర్ 30, 2026 వరకు మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్ట్ సెక్షన్30 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ జానకి తెలిపారు. సెక్షన్30 అమలులో ఉన్న సమయంలో సంబంధిత పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా ర్యాలీలు, ఊరేగింపులు, ధర్నాలు, నిరసనలు, బహిరంగ సభలు, సమావేశాలు లేదా పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనే కార్యక్రమాలు నిర్వహించరాదని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రజా శాంతిభద్రతలకు భంగం కలిగించేలా నిబంధనలను ఉల్లంఘించి కార్యక్రమాలు నిర్వహించే వారిపై సంబంధిత చట్టాల ప్రకారం కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారంపై నిఘా :**

సోషల్ మీడియా వేదికలను ఉపయోగించి తప్పుడు ప్రచారం, వదంతులు, మత విద్వేషాలను రెచ్చగొట్టే లేదా సామాజిక ఉద్రిక్తతలకు దారితీసే పోస్టులు, వీడియోలు, సందేశాలను ప్రచారం లేదా ప్రసారం చేసే వారిపైనా చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్పీ స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వచ్చే సమాచారాన్ని నిర్ధారించుకోకుండా ఇతరులకు ఫార్వర్డ్ చేయడం ద్వారా అనవసర ఉద్రిక్తతలకు కారణం కావద్దని ప్రజలకు సూచించారు.

**పోలీసుల అనుమతి తప్పనిసరి :**

సభలు, సమావేశాలు, ర్యాలీలు లేదా ఇతర బహిరంగ కార్యక్రమాలు నిర్వహించదలచిన వారు ముందుగానే సంబంధిత పోలీసు అధికారులను సంప్రదించి తప్పనిసరిగా అనుమతి పొందాలని ఎస్పీ సూచించారు. జిల్లాలో శాంతిభద్రతలు, ప్రజా ప్రశాంతత పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, పోలీసు శాఖకు ప్రజలు సహకరించాలని జిల్లా ఎస్పీ జానకి కోరారు.

# మహిళా సంఘాల నిధుల్లో మాయాజాలం!

మొదటిపేజీ తరువాయి

- కేటీ దొడ్డిలో నిబంధనలకు విరుద్ధంగా లక్షల నగదు డ్రా చేసినట్లు ఆరోపణలు
- ఏపీఎం,అకౌంటెంట్ తీరుపై అనుమానాలు-సమగ్ర విచారణకు మహిళా సంఘాల సభ్యుల డిమాండ్




**గద్వాల ఆగస్టు 31(ప్రజా జ్యోతి):**

పేద మహిళలు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో పొదుపు చేసుకుంటూ ఏర్పాటు చేసుకున్న మండల మహిళా సమాఖ్య నిధుల విషయంలో కేటీ దొడ్డి మండలంలో తీవ్ర ఆరోపణలు వెలువడుతున్నాయి.ఎలాంటి తీర్మానాలు,సంబంధిత సంఘాల అనుమతులు లేకుండానే లక్షల రూపాయలను నగదు రూపంలో డ్రా చేసినట్లు ఆరోపణలు రావడం కలకలం రేపుతోంది.ఈ వ్యవహారంలో మండల ఏపీఎం,అకౌంటెంట్‌తో పాటు కార్యాలయ సిబ్బంది పాత్రపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**నిబంధనలు ఏమంటున్నాయి?**

మహిళా సంఘాల సభ్యులకు రుణాలు మంజూరు చేసే విషయంలో ప్రభుత్వం నిర్దేశించిన విధానాలు ఉన్నాయి.రుణం అవసరమైన సభ్యురాలు తొలుత తన సంఘం ద్వారా గ్రామ సంఘానికి దరఖాస్తు చేసుకోవాలి.అనంతరం గ్రామ సంఘం సమావేశం నిర్వహించి,దరఖాస్తుపై తీర్మానం చేయాలి.ఆ తీర్మానం ప్రతిని మండల మహిళా సమాఖ్యకు పంపిన తర్వాత సంబంధిత అధికారులు పరిశీలించి,నిబంధనల ప్రకారం రుణాన్ని మంజూరు చేయాల్సి ఉంటుంది.మంజూరైన మొత్తాన్ని నేరుగా నగదు రూపంలో కాకుండా మండల సమాఖ్య నుంచి గ్రామ సంఘం ఖాతాకు నెఫ్ట్ లేదా చెక్కు ద్వారా జమ చేయాలి.అక్కడి నుంచి చిన్న సంఘం ఖాతాకు,అనంతరం రుణం పొందే సభ్యురాలి వ్యక్తిగత బ్యాంకు ఖాతాకు నగదు బదిలీ కావాల్సి ఉంటుంది.ఇదే సాధారణంగా అమలులో ఉన్న విధానంగా మహిళా సంఘాల సభ్యులు పేర్కొంటున్నారు.

**తీర్మానాలు లేకుండానే నగదు డ్రా చేశారా?**

అయితే కేటీ దొడ్డి మండల మహిళా సమాఖ్యకు సంబంధించి ఈ నిబంధనలు పాటించలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.సంబంధిత గ్రామ సంఘాల నుంచి దరఖాస్తులు,తీర్మానాలు లేకుండానే,మండల మహిళా సమాఖ్య కమిటీ సభ్యుల పూర్తి అనుమతి లేకుండా వెంకటాపురం ఇండియన్ బ్యాంకు ఖాతా నుంచి లక్షల రూపాయలు నగదు రూపంలో డ్రా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.కమిటీ సభ్యుల సంతకాలు, అనుమతులకు సంబంధించిన అంశాలపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అసలు ఏ ప్రయోజనం కోసం,ఎవరి అనుమతితో,ఏ విధానంలో ఇంత పెద్ద మొత్తంలో నగదు డ్రా చేశారనే విషయంపై స్పష్టత రావాల్సి ఉందని మహిళా సంఘాల సభ్యులు కోరుతున్నారు.

**ఉన్నతాధికారులు స్పందించాలి**

మహిళల కష్టార్జితంగా కూడబెట్టిన నిధుల నిర్వహణలో పారదర్శకత అత్యంత అవసరమని పలువురు మహిళా సంఘాల సభ్యులు పేర్కొంటున్నారు.నిధుల విషయంలో అక్రమాలు జరిగి ఉంటే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.ఈ వ్యవహారంపై డీఆర్‌డీఏ పీడీ సంబంధిత సిబ్బందికి సంజాయిషీ కోరినట్లు సమాచారం.అయితే కేవలం నోటీసులు,సంజాయిషీలకే పరిమితం కాకుండా జిల్లా కలెక్టర్ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి సమగ్ర విచారణ జరిపించాలని మహిళా సంఘాల సభ్యులు కోరుతున్నారు.బ్యాంకు లావాదేవీలు, చెక్కులు,విత్‌డ్రా వివరాలు,తీర్మానాలు,సంబంధిత రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తేవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.ఆరోపణలు నిజమని తేలితే నిధుల దుర్వినియోగానికి బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు,మహిళా సంఘాల నిధులకు భద్రత కల్పించాలని సభ్యులు కోరుతున్నారు.

## విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు:జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

- ఎస్ఐఆర్ నోటీసుల పంపిణీని వేగవంతం చేయాలి
- క్షేత్రస్థాయిలో తహసీల్దార్లు,ఎంపీడీవోలు పర్యటించాలి



**గద్వాల ఆగస్టు 31(ప్రజా జ్యోతి ప్రతినిధి):**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా నోటీసుల పంపిణీని వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు.తహసీల్దార్లు,ఎంపీడీవోలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రక్రియను పర్యవేక్షించాలని సూచించారు.సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా ఎన్నికల అధికారులతో వెబ్‌ఎక్స్ సమావేశం నిర్వహించారు. మ్యాపింగ్ కాని ఓటర్లు,అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్లకు నోటీసుల పంపిణీ, హియరింగ్ ప్రక్రియపై అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,నోటీసుల పంపిణీని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని వేగవంతం చేయాలని సూచించారు.పోలింగ్ స్టేషన్ వారీగా ప్రతిరోజూ గరిష్ట సంఖ్యలో నోటీసులను సంబంధిత ఓటర్లకు అందజేసి,తప్పనిసరిగా అక్నాలెడ్జ్‌మెంట్ పొందాలని ఆదేశించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన 11 గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకదాన్ని సంబంధిత ఓటర్లు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు.బూత్ లెవల్ అధికారులుగా (బీఎల్‌వోలు) విధులు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు తమ పరిధిలోని ఓటర్లకు నోటీసులు అందించడంలో అలసత్వం వహించరాదని కలెక్టర్ స్పష్టం చేశారు.అంగన్‌వాడీ టీచర్లతో మహిళా సంక్షేమ శాఖ అధికారులు సమావేశం నిర్వహించి,విధులపై స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని సూచించారు.సెప్టెంబర్ 1వ,తేదీ నుంచి ప్రతిరోజూ ఎంత మంది బీఎల్‌వోలు విధుల్లో ఉన్నారు,నోటీసుల పంపిణీ ఎంత మేరకు పూర్తయిందనే వివరాలతో నివేదిక అందించాలని ఆదేశించారు.రెండు రోజుల్లో నోటీసుల జారీ ప్రక్రియను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. విధుల్లో అలసత్వం వహించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమోహన్,ఆర్డీవో శ్రీనివాసరావు,ఎన్నికల విభాగం అధికారి మంజుల,వివిధ మండలాల తహసీల్దార్లు,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పేదోళ్ల ఆరోగ్యానికి సీఎం ఫండ్ కొండంత అండ



- రూ.45 లక్షల చెక్కులు.. 150 కుటుంబాలకు ఊరట
- పార్టీలకతీతంగా పేదలకు వైద్య సాయం.. వైద్య ఖర్చులపై పేదలకు 'రిలీఫ్'
- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి

**వనపర్తి, ఆగస్టు 31 (ప్రజాజ్యోతి):**

పేద ప్రజలకు అత్యవసర వైద్య చికిత్సల సమయంలో ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) కొండంత అండగా నిలుస్తోందని తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. సోమవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన పేదలకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.45,31,100 విలువైన 150 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలను పాలనకు కేంద్రబిందువుగా చేసుకుని సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయాన్ని సమన్వయంతో ముందుకు తీసుకెళ్తూ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రగతిలో కొత్త అధ్యాయాన్ని నమోదు చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం సెప్టెంబర్ 1 నాటికి వెయ్యి రోజుల పాలన మైలురాయిని చేరుకుంటుందన్నారు. గత ప్రభుత్వ అప్పులను తీర్చుకుంటూనే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రికార్డు స్థాయిలో సీఎం రిలీఫ్ ఫండ్ ఆర్థిక సహాయాన్ని అందిస్తోందన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్య సేవలు అందుతున్నాయని, ఆరోగ్యశ్రీ వర్తించని వారికి చికిత్స అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక ఉపశమనం కల్పిస్తున్నామని తెలిపారు. పేదల ఆరోగ్యానికి సీఎం సహాయనిధి ఆర్థిక సాయం కొండంత ఆసరాగా నిలుస్తోందన్నారు. వనపర్తి నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా మానవతా దృక్పథంతో అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి పేద కుటుంబానికి చేరేలా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. చెక్కులను అందుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, రాష్ట్ర మైనార్టీ నాయకుడు అక్తర్, జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ దేవన్న యాదవ్, కో-కోఆర్డినేటర్ చంద్రశేఖర్, వనపర్తి జిల్లా ఏఐపీసీ అధ్యక్షుడు నాగార్జున, పట్టణ ప్రధాన కార్యదర్శి అడ్వకేట్ బాబా, యూత్ కాంగ్రెస్ నాయకులు ఆవుల చంద్రశేఖర్, అనిల్, అయ్యవారిపల్లె సర్పంచ్ కురుమన్న, కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, సహదేవుడు, మన్యం యాదవ్, రాముడు, హరిబాబు రెడ్డి, ఇమ్రాన్, శ్రీధర్, వెంకటేష్ సాగర్, ఆనంద్ సాగర్, శివనారాయణ, చెన్నయ్య, వెంకటేష్, నాగన్నగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్‌గౌడ్, నరసింహ, పెద్దమందడి మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు తదితరులు పాల్గొన్నారు.

## "ప్రతి విద్యార్థి అభ్యసన ప్రగతి ప్రతి పాఠశాల విజయానికి పునాది ప్రతి మండలం ప్రగతి జిల్లా విద్యాభివృద్ధికి బాట."

- బేస్‌లైన్ ఫలితాలను మెరుగుపరచాలి - విద్యార్థుల అభ్యసన లోపాలను గుర్తించి రెమీడియల్ బోధన చేపట్టాలి: డీఈఓ విజయకుమారి



**మహబూబ్‌నగర్, ఆగస్టు 31( ప్రజా జ్యోతి బ్యూరో ):**

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మరింత మెరుగుపరిచేందుకు బేస్‌లైన్ పరీక్ష ఫలితాలను మండలాల వారీగా విశ్లేషించి, లోపాలను గుర్తించి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని జిల్లా విద్యాశాఖాధికారి విజయకుమారి సూచించారు. స్థానిక మోడల్ బేసిక్ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ లు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, అకాడమిక్ ప్యానెల్ ఇన్‌స్పెక్షన్ టీమ్ సభ్యులతో జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎఫ్ ఎల్ ఎన్ కాంపిటెంట్ స్కూల్స్ నిర్వహణ, అకాడమిక్ ప్యానెల్ తనిఖీలు, జిల్లాలో నిర్వహించిన బేస్లైన్ టెస్ట్ ఫలితాలు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా డీఈఓ విజయకుమారి మాట్లాడుతూ మండలాల వారీగా నమోదైన బేస్‌లైన్ పరీక్ష ఫలితాల శాతాలను పరిశీలించారు. ప్రతి మండలం ప్రస్తుత ఫలితాలను మరింత మెరుగుపరుచుకునేలా ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. విద్యార్థుల అభ్యసన స్థాయిని పెంచేందుకు రిమీడియల్ టీచింగ్, నిరంతర అభ్యాసం, కార్యాచరణ ఆధారిత బోధనకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి విద్యార్థి అభ్యసన ప్రగతిని ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ఏ ఎం ఓ శ్రీనివాస్ సమావేశం ఉద్దేశ్యాన్ని వివరిస్తూ ఎఫ్ ఎల్ ఎన్ కాంపిటెంట్ స్కూల్స్ లక్ష్యాల సాధన, బేస్‌లైన్ పరీక్ష ఫలితాల మెరుగుదల, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపునకు చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. ఎంఈఓ లు, క్లస్టర్ హెచ్ ఎం, అకడమిక్ ప్యానెల్ ఇన్స్పెక్షన్ టీమ్ సభ్యులు సమన్వయంతో పనిచేసి మండలాల వారీగా విద్యా ఫలితాలను మెరుగుపరిచేందుకు కృషి చేయాలని సమావేశంలో సూచించారు. ఈ సమావేశంలో జీ సి ఇ ఓ అస్రా ఖాద్రి పాల్గొన్నారు.

# పటిష్ట పోలీస్ బందోబస్తు మధ్య కేంద్ర మంత్రి పర్యటన ప్రశాంతంగా పూర్తి

## - ఎస్పీ టి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో అలంపూర్, గద్వాల రైల్వే స్టేషన్ల సందర్శన





**గద్వాల ఆగస్టు 31(ప్రజా జ్యోతి ప్రతినిధి):**

జోగుళాంబ గద్వాల జిల్లాలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి,మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి,అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు,రైల్వే డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్ఎం) సంతోష్ కుమార్ వర్మతో పాటు ఇతర అధికారులు, లప్రజాప్రతినిధులు సోమవారం అలంపూర్,గద్వాల రైల్వే స్టేషన్లను సందర్శించారు.కేంద్ర మంత్రి,ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల పర్యటన నేపథ్యంలో జోగుళాంబ గద్వాల జిల్లా పోలీస్ శాఖ పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసింది.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు ప్రణాళికతో వివిధ ప్రాంతాల్లో బందోబస్తును ఏర్పాటు చేశారు.జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు స్వయంగా బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ పోలీసు అధికారులు,సిబ్బందికి పలు సూచనలు చేశారు.రైల్వే స్టేషన్లు,సందర్శన ప్రాంతాలు,రాకపోకల మార్గాలు,ఇతర కీలక ప్రాంతాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసి భద్రతా చర్యలను కట్టుదిట్టంగా అమలు చేశారు.పర్యటన సందర్భంగా ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా,ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పోలీసు అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టారు. కార్యక్రమం ప్రారంభం నుంచి ముగిసే వరకు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన భద్రతా చర్యలు తీసుకున్నారు.పోలీసు శాఖ సమర్థవంతమైన ప్రణాళిక, అధికారుల సమన్వయం,సిబ్బంది అప్రమత్తతతో కేంద్ర మంత్రి,ప్రజాప్రతినిధుల పర్యటన ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా ముగిసింది. బందోబస్తు విధుల్లో పాల్గొన్న పోలీసు అధికారులు,సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వర్తించారు.

# విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యంగా 16 ఏళ్ల సేవ

## - ప్రభుత్వ అంధుల పాఠశాల అభివృద్ధిలో ప్రధానోపాధ్యాయుడు ఒంగ రాములు విశేష కృషి

**మహబూబ్‌నగర్ నగరం, ఆగస్టు 31 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

ప్రభుత్వ అంధుల పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా ఒంగ రాములు 16 సంవత్సరాల పాటు అందించిన సేవలు, విద్యార్థుల పట్ల ఆయన చూపిన అంకితభావం, పాఠశాల అభివృద్ధికి చేసిన కృషి అభినందనీయమని పలువురు కొనియాడారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు విద్యను అందించడంతో పాటు వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, స్వయం ఆధారితంగా ఎదిగేలా ప్రోత్సహించడం వంటి అంశాలకు రాములు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పాఠశాలలో విద్యా ప్రమాణాల మెరుగుదలకు, మౌలిక వసతుల అభివృద్ధికి నిరంతరం కృషి చేసినట్లు తెలిపారు. 16 సంవత్సరాల సుదీర్ఘ సేవా ప్రస్థానంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల అభివృద్ధితో ఆయనకు ఏర్పడిన అనుబంధం ప్రత్యేకమైనదని పలువురు అభిప్రాయపడ్డారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి విద్యార్థుల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడానికి చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు.ప్రభుత్వ అంధుల పాఠశాలలో ఆయన అందించిన సేవలకు అభినందనలు తెలుపుతూ, భవిష్యత్తులోనూ విద్యారంగానికి ఆయన సేవలు కొనసాగాలని ఆకాంక్షించారు.



# కేజీబీవీ గండీడులో విద్యార్థుల భద్రతపై అపోహలకు తావులేదు

## - సీసీ కెమెరాల పరిశీలనలో విద్యార్థులు గోడ దూకినట్లు ఆధారాలు లేవు : డీఈఓ ఐ. విజయకుమారి

**మహబూబ్‌నగర్, ఆగస్టు 31, ( ప్రజా జ్యోతి బ్యూరో ):**
మహ్మదాబాద్ మండల పరిధిలోని కేజీబీవీ గండీడ్ పాఠశాలను సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారి ఐ. విజయకుమారి సందర్శించారు. ఈ సందర్భంగా జీసీడీఓ అస్రా ఖాద్రి, ఎంఈఓ రాజు నాయక్ ఆమె వెంట ఉన్నారు. డీఈఓ విద్యార్థులతో కలిసి భోజనం చేసి, వారితో నేరుగా మాట్లాడి పాఠశాలలో అందుతున్న వసతి సౌకర్యాలు, విద్యాబోధన, భద్రతా ఏర్పాట్లపై వివరాలు తెలుసుకున్నారు. ఇటీవల పత్రికల్లో వచ్చిన కొన్ని వార్తల నేపథ్యంలో పాఠశాలలోని సీసీ కెమెరాల ఫుటేజీని అధికారులు పరిశీలించారు. విద్యార్థులు పాఠశాల గోడ దూకి బయటకు వెళ్లినట్లు ఎలాంటి ఆధారాలు లేవని అధికారులు తెలిపారు. ఆదివారం సెలవు దినం కావడంతో కొంతమంది విద్యార్థులు చదువుకోగా, మరికొందరు సీపీటీ పరీక్ష రాశారని, ఇంకొందరు పాఠశాల ప్రాంగణంలోనే ఆడుకున్నారని విద్యార్థులు రాతపూర్వకంగా వివరించినట్లు తెలిపారు. సీసీ కెమెరాల ఫుటేజీలో కూడా విద్యార్థులు పాఠశాల ప్రాంగణం, గేటు పరిధిలోనే ఉన్నట్లు నమోదైందని, విద్యార్థుల భద్రత విషయంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు నిర్ధారణ కాలేదని అధికారులు స్పష్టం చేశారు.

**విధులకు గైర్హాజరైన టీచర్‌కు షోకాజ్ నోటీసు :**
ఆదివారం 30-08-2026న కేజీబీవీ గండీడులో డ్యూటీలో ఉన్న సీఆర్‌టీ గణితం ఉపాధ్యాయురాలు పి. నాగరాణి ముందస్తు అనుమతి లేకుండా, సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వకుండా విధులకు గైర్హాజరైనట్లు అధికారులు గుర్తించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు ఆమెకు షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు తెలిపారు.

**తల్లిదండ్రుల సందర్శనకు నిబంధనలు పాటించాలి:**
కేజీబీవీలో విద్యార్థులను తల్లిదండ్రులు కలిసేందుకు ప్రతి రెండో ఆదివారం సందర్శనకు అనుమతి ఉందని అధికారులు తెలిపారు. అయితే కొంతమంది తల్లిదండ్రులు నిర్దేశించిన నిబంధనలు పాటించకపోవడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నట్లు పేర్కొన్నారు. పాఠశాల సిబ్బంది తల్లిదండ్రులతో ఘర్షణకు దిగినట్లు పత్రికల్లో వచ్చిన వార్తలు వాస్తవం కాదని అధికారులు స్పష్టం చేశారు.

**గేటు వద్ద భద్రతా సిబ్బంది ఉన్నారు:**
సీసీ కెమెరా ఫుటేజీ పరిశీలనలో పాఠశాల ప్రధాన గేటు వద్ద వాచ్‌మెన్‌తో పాటు మరో వర్కర్ కూడా ఉన్నట్లు గుర్తించామని అధికారులు తెలిపారు. గేటుకు తాళం వేసి ఉన్నట్లు ఫుటేజీలో నమోదైందని, విద్యార్థుల భద్రత విషయంలో సిబ్బంది అజాగ్రత్తగా వ్యవహరించినట్లు ఆధారాలు కనిపించలేదని తెలిపారు.

**సిబ్బంది మధ్య సమన్వయంపై కలెక్టర్‌కు నివేదిక:**
కేజీబీవీ ఇన్‌చార్జి స్పెషల్ ఆఫీసర్ మాటను కొంతమంది సిబ్బంది పట్టించుకోవడం లేదని, నిబంధనలు పాటించడం లేదని ఇన్‌చార్జి స్పెషల్ ఆఫీసర్ రాతపూర్వకంగా తెలిపినట్లు అధికారులు పేర్కొన్నారు. కేజీబీవీ గండీడులో పనిచేస్తున్న టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బందిలో పలువురు సుమారు 10 నుంచి 15 సంవత్సరాలుగా అదే పాఠశాలలో పనిచేస్తున్న నేపథ్యంలో సిబ్బంది మధ్య సమన్వయం, పరస్పర ఆధిపత్య ధోరణులపై కూడా అంశాలు అధికారుల దృష్టికి వచ్చినట్లు తెలిపారు. ఈ అంశాలన్నింటినీ సమగ్రంగా పరిశీలించి, అవసరమైన చర్యల కోసం గౌరవ జిల్లా కలెక్టర్‌కు నివేదిక సమర్పించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు. విద్యార్థుల భద్రత, విద్యాబోధన, వసతి సౌకర్యాల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, వాస్తవ






పరిస్థితులను సీసీ కెమెరా ఫుటేజీ, విద్యార్థుల వాంగ్మూలాలు, అధికారుల పరిశీలన ఆధారంగా మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

# ప్రజా సమస్యలను పరిష్కరించాలని మంత్రి జూపల్లి కృష్ణారావు కి వినతి పత్రం

## స్థానిక సమస్యలను పరిష్కరించాలని ఎంపీడీవో ఆఫీస్ ముందు ధర్నా.

## సమస్యలు పరిష్కరించకపోతే ప్రజా పోరాటాలు నిర్వహిస్తాం. సిపిఎం మండల కార్యదర్శి డి బాల్ రెడ్డి.





**వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్.**

భారత కమ్యూనిస్టు పార్టీ ( మార్క్సిస్ట్) వీపనగండ్ల మండల కమిటీ ఆధ్వర్యంలో విద్య, వైద్యం స్థానిక సమస్యలపై, సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మండల పరిషత్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, మంత్రి జూపల్లి కృష్ణారావు కి వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి డి బాల్ రెడ్డి మాట్లాడుతూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో గత నెల రోజుల నుండి మండలంలో విద్య, వైద్యం స్థానిక సమస్యలపై సర్వేలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా వచ్చిన సమస్యల పైన గత ఎన్నోసార్లు అధికారులకు మరియు మంత్రి జూపల్లి కృష్ణారావుకి ఇచ్చిన ఇంకా పరిష్కారం కాలేదు. మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ హాస్పిటల్ లో గైనకాలజిస్ట్ లేకపోవడం వల్ల కడుపుతో ఉన్న మహిళలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు, తక్షణమే అవసరమైనటువంటి డాక్టర్లను, సిబ్బందిని వెంటనే నియమించాలని వారి డిమాండ్ చేశారు. మండలంలో ప్రాథమిక, యుపిఎస్, హైస్కూల్లో కాళీ పోస్టులు ఉన్నాయని వెంటనే భర్తీ చేయాలి భర్తీ చేసేంతవరకు విద్యా వాలంటీలను నియమించాలని వారు కోరారు. అర్హులైన వారందరికీ వృద్ధాప్య పింఛన్లు ఇతర పింఛన్లు ఇవ్వాలని, రేషన్ షాపుల ద్వారా 14 రకాల సరుకులు పంపిణీ చేయాలని, బస్సు సౌకర్యాలు లేని గ్రామాలకు బస్సు సౌకర్యాలు కల్పించాలి, రోడ్లు సౌకర్యం లేని గ్రామాలకు బీటీ రోడ్లు నిర్మించాలని, సింగోటం గోపాల్ దిన్నె లింకు కెనాల్ పనులు ప్రారంభించాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. అమలు చేయని పక్షంలో ప్రజలను సమీకరించి పోరాటాల నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి డి బాల్ రెడ్డి, మండల కార్యదర్శి వర్గ సభ్యులు ఎం కృష్ణయ్య, మహబూబ్బాషా, గోపాల్ దీన్నే గ్రామ సర్పంచ్ దొడ్ల కవిత, మండల నాయకులు ఎం రాములు,సిహెచ్ వెంకటయ్య, ఖాజా హుస్సేన్, ఆశన్న, వి కృష్ణయ్య, బాల గౌడ్, నిరంజన్, తిరుపతయ్య, వెంకటేశ్వర్ గౌడ్, రామకృష్ణ, రఘు, నరసింహ, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్‌కు నివాళులర్పించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

## - క్షేత్రస్థాయిలో బీజేపీని బలోపేతం చేయాలి..

## కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**మహబూబ్‌నగర్, ఆగస్టు 31 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి నివాళులర్పించారు. బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని అన్నారు. ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం ఉద్యమించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అంబేద్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు సామాజిక న్యాయం, సమానత్వం కోసం పార్టీ కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మిట్టమీది నాగరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండయ్య ఎడ్ల కృష్ణయ్య, జిల్లా అధికార ప్రతినిధి వెంకటరాములు, కొత్తపేట సర్పంచ్ పుంటికూర చెన్నప్ప, మండల అధ్యక్షుడు రంగయ్య, దొడ్డలోనిపల్లి చెన్నప్పతో పాటు బీజేపీ ఎస్సీ మోర్చా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# రాహుల్‌పై ఎఫ్ఐఆర్ కు నిరసనగా కాంగ్రెస్ ధర్నా

## కుల వివక్షకు వ్యతిరేకంగా, రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాటం కొనసాగిస్తాం: డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్

**మహబూబ్‌నగర్, ఆగస్టు 31( ప్రజా జ్యోతి బ్యూరో ):**

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ను నిరసిస్తూ మహబూబ్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఏ ఐ సీసీ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్ పిలుపు మేరకు, డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో సోమవారం అంబేద్కర్ చౌరస్తాలో ఈ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఉత్తరాఖండ్‌లో బిజెపిఆర్ ఎస్ ఎస్ కార్యకర్తలు నిర్వహించినట్లు కాంగ్రెస్ ఆరోపిస్తున్న కుల వివక్షపూరిత 'పరిశుద్ధీకరణ కార్యక్రమాన్ని' ఖండిస్తూ, రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నినాదాలతో తమ నిరసనను వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమానత్వం, స్వేచ్ఛ, గౌరవంతో జీవించే హక్కును కల్పించిందన్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా కుల వివక్షను ప్రోత్సహించే చర్యలు జరగడం దురదృష్టకరమని అన్నారు.కుల వివక్షకు వ్యతిరేకంగా, సామాజిక సమానత్వం కోసం ప్రశ్నిస్తున్న రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం ప్రజాస్వామ్య గొంతును అణిచివేసే ప్రయత్నమని ఆయన విమర్శించారు. సత్యం, సామాజిక న్యాయం కోసం ప్రశ్నించే గొంతులను కేసులు, బెదిరింపులతో అణచివేయలేరని అన్నారు. దేశంలో కుల, మత విభేదాలను రెచ్చగొట్టి ప్రజలను విభజించే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ సహించబోదని సంజీవ్ ముదిరాజ్ స్పష్టం చేశారు. రాజ్యాంగ పరిరక్షణ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాల సాధన, సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ తన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని తెలిపారు.రాహుల్ గాంధీపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ను వెంటనే ఉపసంహరించుకోవాలని, కుల వివక్షకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు సత్తూరు చంద్రకుమార్ గౌడ్, బెక్కరి మధుసూదన్ రెడ్డి, పొల్లెపల్లి యాదయ్య, సీనియర్ నాయకులు వినోద్ కుమార్, డిసిసి ప్రధాన కార్యదర్శులు రాములు యాదవ్, సాయిబాబా, ఎం.ఏ. కలీం, బంగ్లా రవి, ధోమ పరమేష్, కార్పొరేటర్లు అవేజ్, ఎంపీ ప్రవీణ్ కుమార్, రమేష్ బాబు, తాహెర్, షబీర్, మాగ్యా నాయక్, ఉమర్ కొత్వాల్, ఫక్రు, మండల అధ్యక్షులు శేఖర్, మహేందర్, గ్రంథాలయ చైర్మన్ మల్లి నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనితా రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అక్తర్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పసుల రాజు, జిల్లా మత్స్య పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు గోనెల శ్రీను,




గుడ్డిమల్కాపూర్ సర్పంచ్ కేశవులు, సేవాదళ్ నాయకులు అబూకర్, వెంకట్ లక్ష్మి, డిసిసి సభ్యులు కంచిమి లక్ష్మణ్, గోపాల్ యాదవ్ తదితరులతో పాటు యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్ యు ఐ, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నూతన పోలీసు అధికారుల సంఘం కమిటీకి ఎస్పీ అభినందనలు

## - సిబ్బంది సంక్షేమం, సమస్యల పరిష్కారానికి సంఘం నిర్మాణాత్మకంగా పనిచేయాలి: ఎస్పీ జానకి

**మహబూబ్‌నగర్ ఆగస్టు 31 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**



మహబూబ్‌నగర్ జిల్లాలో నూతనంగా ఏర్పాటైన పోలీసు అధికారుల సంఘం కమిటీ సభ్యులు సోమవారం జిల్లా ఎస్పీ జానకిను జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన కమిటీ ఏర్పాటైన విషయాన్ని ఎస్పీకి తెలియజేశారు.ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు ప్యారసాని సురేష్, ప్రధాన కానిస్టేబుల్, ఉపాధ్యక్షులు వై. అశోక్ కుమార్, ఆర్ఐ, కె. వెంకటేష్, ఎస్ఐహన్వాడ, కార్యదర్శి ఎం. అప్పయ్య, మహబూబ్‌నగర్ వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్, సంయుక్త కార్యదర్శి జి. పవన్ కుమార్ గౌడ్, పీసీ, నిర్వహణ కార్యదర్శి జి. యాదగిరయ్య గౌడ్, ఏఆర్ఎస్ఐ, కోశాధికారి బి. శేఖర్, హెడ్ కానిస్టేబుల్ తదితరులు ఎస్పీని కలిశారు. అలాగే కార్యవర్గ సభ్యులు పోతురాజు యాదయ్య, ఏఆర్‌హెచ్‌సీ, ఏ. రవికుమార్, హెడ్ కానిస్టేబుల్, జె. రాఘవేందర్, పీసీ, ఎల్. రాజేశ్వర్ రెడ్డి, పీసీ, ఎస్. పద్మమ్మ, డబ్ల్యూపీసీ, టి. సురేష్, ఏఆర్‌పీసీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు ప్యారసాని సురేష్ మాట్లాడుతూ పోలీసు అధికారులు, సిబ్బందికి మరియు ఉన్నతాధికారులకు మధ్య సంఘం అనుసంధానకర్తగా పనిచేస్తుందని తెలిపారు. సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు, వారి సంక్షేమానికి సంబంధించిన అంశాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎస్పీకి తెలిపారు. సంఘం సభ్యులందరూ సమన్వయంతో పనిచేస్తూ పోలీసు శాఖ అభివృద్ధికి, సిబ్బంది సంక్షేమానికి తమ వంతు సహకారం అందిస్తారని పేర్కొన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ దరావత్ జానకి నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. పోలీసు సిబ్బంది సంక్షేమం, సమస్యల పరిష్కారం, శాఖలో సమన్వయం పెంపొందించే దిశగా సంఘం నిర్మాణాత్మకంగా పనిచేయాలని సూచించారు. పోలీసు శాఖలో క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన విధులు, పరస్పర సహకారం ఎంతో ముఖ్యమని ఎస్పీ పేర్కొన్నారు. సిబ్బంది సమస్యలను సరైన విధానంలో అధికారుల దృష్టికి తీసుకురావడంలో సంఘం కీలక పాత్ర పోషించాలని సూచించారు.అధికారులు, సిబ్బంది మధ్య సమన్వయం, పరస్పర గౌరవం, బృంద స్ఫూర్తి మరింత బలోపేతం కావాలని, పోలీసు శాఖ ప్రతిష్ఠను మరింత పెంచే విధంగా ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని ఎస్పీ సూచించారు. నూతన కమిటీకి తన పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్.బి. రత్నం, జిల్లా నేర పరిశోధనా విభాగం డీఎస్పీ రమణారెడ్డి కూడా పాల్గొన్నారు.

# పుట్టినరోజు వేడుక... 105 యూనిట్ల ప్రాణరక్షణ!

### - యువశక్తి మెగా బ్లడ్ క్యాంప్ సక్సెస్

### - హర్షవర్ధన్ రెడ్డి జన్మదినం సందర్భంగా మెగా రక్తదాన శిబిరం

**వనపర్తి ప్రతినిధి, ఆగస్టు 31 (ప్రజాజ్యోతి):**

కొల్లాపూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని పానుగల్ మండలంలో యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. యువశక్తి ఫౌండేషన్ నాయకుడు సోమిశెట్టి కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ముఖ్య అతిథిగా జ్యోతి నందన్ రెడ్డి హాజరై ప్రారంభించారు. బీఆర్ఎస్ నాయకులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. శిబిరంలో మొత్తం 105 యూనిట్ల రక్తాన్ని సేకరించి ప్రభుత్వ ఆసుపత్రికి పంపించినట్లు యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కాగితాల మధు తెలిపారు. ఈ సందర్భంగా సోమిశెట్టి కిషోర్ కుమార్ మాట్లాడుతూ "రక్తదానం ప్రాణదానంతో సమానం. ఒక వ్యక్తి ఇచ్చే రక్తం పలువురి ప్రాణాలను కాపాడేందుకు ఉపయోగపడుతుంది" అని అన్నారు. రక్తదాన కార్యక్రమం అనంతరం అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించినట్లు తెలిపారు. ఇంతటి సేవా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన సోమిశెట్టి కిషోర్ కుమార్‌ను యువశక్తి ఫౌండేషన్ ప్రతినిధులు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వీరసాగర్, మాజీ ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ చంద్రశేఖర్, జ్యోతి నందన్ రెడ్డి, సోమిశెట్టి కిషోర్ కుమార్, యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కాగితాల మధు, న్యాయవాది రవికుమార్, బాలవర్ధన్ రెడ్డి, రాజవర్ధన్ రెడ్డి తదితర నాయకులు, యువకులు పాల్గొన్నారు.




# 41 ఏళ్ల పోలీసు సేవా ప్రస్థానం స్ఫూర్తిదాయకం:ఎస్పీ టి.శ్రీనివాసరావు

### - కానిస్టేబుల్‌గా ప్రారంభమై ఎస్సైగా పదవీ విరమణ

**గద్వాల,ఆగస్టు 31(ప్రజా జ్యోతి ప్రతినిధి):**

కానిస్టేబుల్‌గా పోలీసు ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి,అంచెలంచెలుగా ఎదిగి ఎస్సై హోదాలో పదవీ విరమణ పొందిన జిక్కిబాబు సేవలు అభినందనీయమని జోగుళాంబ గద్వాల జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు అన్నారు.జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్సై జిక్కిబాబు పదవీ విరమణ కార్యక్రమాన్ని ఆత్మీయ వాతావరణంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ,41 ఏళ్ల సుదీర్ఘ పోలీసు సేవలో జిక్కిబాబు అనేక బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించారని,క్రమశిక్షణ,అంకితభావం,నిబద్ధతతో విధులు నిర్వహించి శాఖకు సేవలందించారని కొనియాడారు.కానిస్టేబుల్‌గా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించిన జిక్కిబాబు హెడ్ కానిస్టేబుల్,ఏఎస్సై,ఎస్సై హోదాల వరకు ఎదగడం ఆయన కృషి,అంకితభావానికి నిదర్శనమన్నారు.ఆయన సుదీర్ఘ సేవా అనుభవం, క్రమశిక్షణ,సహచరులతో వ్యవహరించిన తీరు యువ పోలీసు సిబ్బందికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు.పదవీ విరమణ ఉద్యోగ జీవితానికి మాత్రమే ముగింపు అని, పోలీసు శాఖకు,సమాజానికి అందించిన సేవలకు ఎప్పటికీ గుర్తింపు ఉంటుందని ఎస్పీ తెలిపారు.అనంతరం జిక్కిబాబును ఘనంగా సన్మానించి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు.ఆయన భవిష్యత్ జీవితం ఆరోగ్యం,ఆనందం,ప్రశాంతతతో సాగాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో అదనపు ఎస్పీ కే.శంకర్,గద్వాల డీఎస్పీ వై.మొగిలయ్య, కార్యాలయ ఏవో సాయికృష్ణ,పదవీ విరమణ పొందిన ఎస్సై జిక్కిబాబు కుటుంబ సభ్యులు,పోలీసు అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# పాలమూరు యూనివర్సిటీలో తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం

### - ఉద్యమకారుల సమస్యల పరిష్కారంపై త్వరలో కీలక సమావేశం

**మహబూబ్‌నగర్ ఆగస్టు 31 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

పాలమూరు యూనివర్సిటీలో తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించేందుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా సోమవారం పాలమూరు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జి. శ్రీనివాస్, రిజిస్ట్రార్ రమేష్‌బాబులను తెలంగాణ ఉద్యమకారులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించారు.ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారులకు సంబంధించిన వివిధ సమస్యలు, వారి హక్కులు, ప్రభుత్వ పరంగా అందాల్సిన గుర్తింపు తదితర అంశాలపై వీసీ, రిజిస్ట్రార్‌తో చర్చించారు. త్వరలో పాలమూరు యూనివర్సిటీలో తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కేకే కమిటీ ప్రతినిధులతో పాటు రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి ముఖ్య అతిథులుగా హాజరయ్యే అవకాశం ఉందని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలాల కేటాయింపు, పింఛన్, ఉద్యమకారులుగా గుర్తింపు కార్డుల జారీ తదితర అంశాలపై సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పీయూ జేఏసీ చైర్మన్ పోలే నరేందర్, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ అన్వర్ పాషా, ఉపాధ్యక్షుడు శివ, కన్వీనర్ నరసింహ, రాము, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



# ఎల్లలు లేని ప్రేమకు, వెలకట్టలేని విలువలకు రాఖీ ఓ చిహ్నం

## - జర్నలిస్టులకు రాఖీలు కట్టి.. ఆత్మీయత చాటిన మాజీ ప్రజాప్రతినిధులు

## - నాకు అన్నలు తమ్ములు లేకపోయినా.. మీరే అన్నలు'

**చిన్నంబావి, ఆగస్టు 31 (ప్రజా జ్యోతి )**

రక్షాబంధన్ సందర్భంగా చిన్నంబావి మండల కేంద్రంలో మాజీ ప్రజాప్రతినిధులు జర్నలిస్టు మిత్రులకు రాఖీలు కట్టి ఆత్మీయతను చాటుకున్నారు. మాజీ ఎంపీపీ సోమేశ్వరమ్మ, మాజీ జెడ్పీటీసీ కేసిరెడ్డి వెంకటరమణమ్మ, మాజీ ఎంపీటీసీ తగరం లక్ష్మి జర్నలిస్టులకు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ కేసిరెడ్డి వెంకటరమణమ్మ మాట్లాడుతూ 'నాకు అన్నలు తమ్ములు లేకపోయినా.. మీరే అన్నలుగా తమ్ములు గా భావిస్తున్నాను' అంటూ భావోద్వేగానికి గురయ్యారు. జర్నలిస్టులతో తమకు ఉన్న అనుబంధం ఎప్పటికీ కొనసాగాలని ఆకాంక్షించారు. రక్షాబంధన్ అన్నాచెల్లెళ్ల అక్కా చెల్లెల అనుబంధానికి ప్రతీక అని, రాఖీ రక్షణకు చిహ్నామని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా ప్రేమ, ఆప్యాయతలు పంచుకునే గొప్ప సంప్రదాయం రక్షాబంధన్ అని తెలిపారు. సోదరభావాన్ని పెంపొందించే ఇలాంటి వేడుకలు సమాజంలో ఆత్మీయతను మరింత పెంచుతాయని పేర్కొన్నారు.



### మాజీ ప్రజాప్రతినిధులకు సన్మానం

జర్నలిస్టులకు రాఖీలు కట్టిన అనంతరం జర్నలిస్టు మిత్రులు మాజీ ఎంపీపీ సోమేశ్వరమ్మ, మాజీ జెడ్పీటీసీ





కేసిరెడ్డి వెంకటరమణమ్మ, మాజీ ఎంపీటీసీ తగరం లక్ష్మిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. పరస్పరం రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రిపోర్టర్లు ప్రజాజ్యోతి రిపోర్టర్ సులిగిరి శ్రీనివాసులు, పోతుగంటి విష్ణు, లక్ష్మోజి, భాను, తగరం కుర్మయ్య, శ్యామ్, బోరెల్లి జయరాం, శివశంకర్, వెంకటేష్, శివ కృష్ణ, సంధ్యాకిరణ్ తదితర జర్నలిస్టులు పాల్గొన్నారు.

# మరమ్మత్తుల కారణంగా నేడు ఉద్యుత్ అంతరాయం

## - విద్యుత్ శాఖ ఏ.ఈ మాన్య నాయక్

**నాగర్ కర్నూల్ : ఆగస్ట్ 31 (ప్రజా జ్యోతి)**

మరమ్మత్తుల కారణంగా నేడు 33/11 కేవీ సబ్ స్టే షన్ మంతటి మరియు 33ఖఎ/11కేవీ సబ్ స్టేషన్ పెద్దముద్దునూర్ ఫీడర్లలో ఉ: 08:00 గంటల నుం డి 09:00 గంటల వరకు ఈ సబ్ స్టేషన్ల 11 కే.వీ ఫీడర్లు ఆఫ్ లో ఉంటాయి కావున 33ఎఎ/11ఖఎ మంతటి సబ్ స్టేషన్ కు సంబంధించిన మంతటి, గగ్గలపల్లి,వనపట్ల, అవురీస్ పల్లి, అనంతసాగర్, గడ్డంపల్లి, రాయిపాకుల, గౌతంపల్లి గ్రామాలతో పాటు వనపట్ల క్రషర్ కంపెనీలకు మరియు 33/11కేవీ పెద్దముద్దునూర్ సబ్ స్టేషన్ల పరిధిలోని పెద్ద ముద్దునూరు, గన్యాగుల,చందుభట్ల,నర్సాయిపల్లి మరియు వెంకటేశ్వర ఆగ్రో ఇండస్ట్రీస్ లకు పవర్ సప్లైలో అంతరాయం ఉంటుందని ప్రజలు గమనిం చి సహకరించాలని విద్యుత్ శాఖ ఏ ఈ మాన్య నాయక్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

# నల్ల బ్యాడ్జిలతో పెన్షన్ విద్రోహ దినాన్ని విజయవంతం చేద్దాం

## - రాష్ట్ర కోశాధికారి సనాతన బాలస్వామి

**నాగర్ కర్నూల్ ఆగస్టు 31 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉద్యోగ ఉపాధ్యాయులు మరియు పెన్షనర్స్ అందరు కూడా వారి కార్యాలయాల ముందు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో 1 సెప్టెంబర్ ను పెన్షన్ విద్రోహ దినాన్ని జరుపుకోవాలని తెలంగాణ సిపిఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కోశాధికారి సనాతన బాలస్వామి అన్నారు. 17 డిసెంబర్ 1982, డీఎస్ నకార వర్సెస్ భారత ప్రభుత్వశీ కేసులో జస్టిస్ వై.వి చెంద్రచూడ్ తో కూడిన ధర్మాసనం ఇచ్చిన తీర్పులో పెన్షన్ అంటే బిక్ష కాదు ఉద్యోగి హక్కు అని తీర్పు నివ్వడం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టో లో సిపిఎస్ ను రద్దు చేసి ఓ పి ఎస్ ను పునరుద్ధరిస్తం అని చెప్పి కూడా ఓ పి ఎస్ ను పునరుద్ధరించలేదని ఒక ప్రకటనలో తెలిపారు.



# సేవలకు గుర్తింపు... రాజేంద్రప్రసాద్ యాదవ్‌కు కీలక బాధ్యత!

## - పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతమే రాజీవ్‌గాంధీ ఆశయం

## - ఘనంగా సన్మానించిన డా. చిన్నారెడ్డి

**వనపర్తి, ఆగస్టు 31 (ప్రజాజ్యోతి):**



గ్రామాల అభివృద్ధి ద్వారానే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన రాజేంద్రప్రసాద్ యాదవ్‌ను రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి ఘనంగా సన్మానించారు. శాలువా కప్పి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి ద్వారానే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. గ్రామపంచాయతీలకు మరిన్ని అధికారాలు, వనరులు అందించడం ద్వారా గ్రామీణాభివృద్ధిని వేగవంతం చేయవచ్చున్నది రాజీవ్‌గాంధీ ఆలోచన అని గుర్తు చేశారు. ప్రజాస్వామ్య వికేంద్రీకరణలో పంచాయతీరాజ్ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి, నియమ నిబంధనలకు లోబడి పనిచేసే నాయకులకు పార్టీ అధిష్టానం తప్పకుండా గుర్తింపు ఇస్తుందని చిన్నారెడ్డి అన్నారు. రాజేంద్రప్రసాద్ యాదవ్ పార్టీకి చేసిన సేవలను గుర్తించే ఈ కీలక బాధ్యత అప్పగించడం అభినందనీయమని పేర్కొన్నారు. కొత్త బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి పార్టీకి మంచి పేరు తీసుకురావడంతో పాటు, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత బాధ్యతలు చేపట్టాలని ఆకాంక్షించారు. రాజేంద్రప్రసాద్ యాదవ్ నాయకత్వంలో రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ ప్రజలకు మరింత చేరువ కావాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, రాష్ట్ర మైనార్టీ నాయకుడు అక్తర్, జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ దేవన్న యాదవ్, కో-కోఆర్డినేటర్ చంద్రశేఖర్, ఏఐపీసీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున, పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అడ్వకేట్ బాబా, యూత్ కాంగ్రెస్ నాయకులు ఆవుల చంద్రశేఖర్, అనిల్, అయ్యవారిపల్లె సర్పంచ్ కురుమన్న, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వైఫల్యాల్లపై.. బి ఆర్ఎస్ సమర శంఖం

## - వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై? గ్రామాల్లో నిలదీయండి

## - ఏడు రోజులపాటు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రభుత్వ వైఫల్యాలపై దృష్టి సారించండి

## - అచ్చంపేట ఇంచార్జ్ సమన్వయకర్త మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి

## - పటేల్ ఫంక్షన్ హాల్ లో ముఖ్య నాయకుల సమావేశం

**నాగర్ కర్నూల్ ఆగస్టు 31 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి )**



కాంగ్రెస్ వెయ్యి రోజుల పరిపాలనపై నాయకులు ప్రజల్లోకి వెళ్లి, ఎండా గట్టెవిధంగా సమర శంఖం పూరించాలని అచ్చంపేట సమన్వయకర్త మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి ఆదేశించారు. అచ్చంపేట నియోజకవర్గం ముఖ్య నాయకుల సమావేశం సోమవారం అచ్చంపేట పట్టణంలోని పటేల్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి హాజరై, నాయకులకు దశ దిశ నిర్దేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేటీఆర్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై నియోజకవర్గంలో ఏడు రోజులపాటు కాంగ్రెస్ మోసపూరిత ఆరు గ్యారంటీలు 420 హామీలపై ప్రతి కార్యకర్త నిలదీయాలని కార్యకర్తలకు ఆయన సూచించారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో సమస్యలపై నాయకులు దృష్టి సారించి, సమస్యలు పరిష్కరించే విధంగా నాయకులు అందుబాటులో ఉండాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల సమస్యలను గాలికి వదిలేసిందని ఆయన ఆరోపించారు. అదే మాదిరిగా రైతుబంధు, రైతు భీమా, కరెంటు, ఎరువులపై అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెల్లిందని ఆయన తీవ్రంగా ధ్వజమెత్తారు. అదేవిధంగా ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్స్ ఉద్యోగాల నియామకాలపై దృష్టి సారించి నిరుద్యోగులతో కలిసి నిరసనలు తెలపాలన్నారు. మహిళల సమస్యల సమస్యల అంశాలపై మహిళలతో కలిసి మహిళల గొంతుకలు వినిపించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పోకల మనోహర్, మాజీ మున్సిపల్ చైర్మన్లు కే తులసీరామ్, ఎడ్ల నరసింహ గౌడ్, రాష్ట్ర నాయకుడు శ్రీకాంత్ భీమా, కౌన్సిలర్లు మన్ను పటేల్, రమేష్ రావు మైనార్టీ నాయకులు కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా ఉపాధ్యాయ పండిత పరిషత్ సభ్యత్వ నమోదు

## - హిందీ దినోత్సవ వేడుకలకు సన్నద్ధం - సంఘం బలోపేతమే లక్ష్యం

## - పండిత పరిషత్ అధ్యక్షుడు విజయ్ కుమార్

**నాగర్ కర్నూల్ : ఆగస్ట్ 31 (ప్రజా జ్యోతి)**



హిందీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లలో భాగంగా జిల్లా రికగ్నైజ్డ్ ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా అధ్యక్ష,ప్రధానకార్యదర్శి ఆధ్వర్యంలో జిల్లాలో జరుగుతున్న హిందీ కాంప్లెక్స్ సమావేశాలను సందర్శిస్తూ ఉపాధ్యాయుల అభిప్రాయాలను సేకరిస్తోంది.ఇందులో భాగంగా జిల్లా ఉపాధ్యాయ పండిత పరిషత్ (టీఎస్) అధ్యక్షుడు విజయకుమార్,కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో పండిత నాయకులు  రూప్ల నాయక్,రామ చంద్రం రాష్ట్ర ఉపాధ్యక్షులు మహ్మద్ బురాన్,సాజిద్,బొమ్మసాని శ్రీనివాసులు, రాజు నాయక్ సోమవారం పలు హిందీ కాంప్లెక్స్ సమావేశాలకు హాజరయ్యారు. అమ్రాబాద్,ఉప్పునుంతల,వంగూరు,సిర్సవాడ హిందీ కాంప్లెక్స్ సమావేశాలను సందర్శించిన నాయకులు అక్కడి హిందీ ఉపాధ్యాయులతో సమావేశమై వారి సమస్యలు,సూచనలను,అభిప్రాయాలను తెలుసుకున్నారు.ఉపాధ్యాయుల సంక్షేమం,వారి సమస్యల పరిష్కారం,హక్కుల సాధనతో పాటు సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు.ఈ సందర్భంగా హిందీ దినోత్సవ వేడుకల నిర్వహణకు సంబంధించి ఉపాధ్యాయుల నుంచి విలువైన సూచనలను స్వీకరించి,హిందీభాష ప్రాధాన్యతను విద్యార్థులకు మరింత చేరువ చేసే విధంగా కార్యక్రమాలు నిర్వహించాలని,ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో వేడుకలను విజయవంతం చేయాలన్నారు.అదేవిదంగా ఉపాధ్యాయ పండిత పరిషత్‌ను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు.పలువురు హిందీ ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా సభ్యత్వం నమోదు చేసుకోవడంతో కార్యక్రమం విజయవంతమైంది.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు విజయకుమార్,కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి సంఘం తరపున కృషిచేస్తామని సంఘం బలోపే తానికి ప్రతి ఉపాధ్యాయుడు భాగస్వామి కావాలని,ఐక్యతతో ముందుకు సాగితే ఉపాధ్యాయుల సమస్యలను సమర్థవంతంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకునే అవకాముం ఉంటుందని అన్నారు.హిందీ ఉపాధ్యాయుల సమస్యలు, సూచనలు నేరుగా తెలుసుకునేందుకు జిల్లాలోని అన్ని హిందీ కాంప్లెక్స్ సమావేశాలను సందర్శించే కార్యక్రమాన్ని కొనసాగిస్తామని నాయకులన్నారు.హిందీ దినోత్సవ వేడుకలను ఉపాధ్యాయులు,విద్యార్థుల భాగస్వామ్యంతో ఘనంగా నిర్వహించేందుకు సమన్వయంతో ముందుకు సాగుతామని వెల్లడించారు.కార్యక్రమంలో ఆయా హిందీ కాంప్లెక్స్‌లకు చెందిన హిందీ ఉపాధ్యాయులు,ఉపాధ్యాయ పండిత పరిషత్ నాయకులు,సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# భూత్పూర్ సర్కిల్ కార్యాలయంలో ఐజీ షానవాజ్ ఖాసిం వార్షిక తనిఖీ

## - పెండింగ్ కేసులు, దర్యాప్తు నాణ్యత, నేర నియంత్రణపై సమీక్ష

**మహబూబ్‌నగర్, ఆగస్టు 31 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**




వార్షిక తనిఖీల్లో భాగంగా మల్టీజోన్×× ఐజీ  షానవాజ్ ఖాసిం సోమవారం భూత్పూర్ సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్ల పనితీరు, కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, నేర నియంత్రణ చర్యలు, సిబ్బంది పనితీరును సమగ్రంగా పరిశీలించారు.తనిఖీలో భాగంగా సర్కిల్ కార్యాలయంలో నిర్వహిస్తున్న కీలక రికార్డులు, రిజిస్టర్లు, కేసు డైరీలు, క్రైమ్ రికార్డులు, పెండింగ్ కేసుల వివరాలు, కోర్టు కేసులు, వారెంట్లు, సీసీటీఎన్ఎస్/ఆన్‌లైన్ రికార్డులు తదితర పోలీసు రికార్డుల నిర్వహణను ఐజీ పరిశీలించారు.సర్కిల్ పరిధిలో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, పెండింగ్ కేసుల పరిష్కారం, దర్యాప్తు నాణ్యత, నేరస్థులపై నిఘా, రౌడీషీటర్ల పర్యవేక్షణ, వారెంట్ల అమలు, బీట్ పెట్రోలింగ్, రాత్రి గస్తీ, మహిళలుబాలల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**దర్యాప్తు నాణ్యతపై ప్రత్యేక దృష్టి :**

కేసుల దర్యాప్తులో సాక్ష్యాల సేకరణ, దర్యాప్తు నాణ్యత, వేగవంతమైన దర్యాప్తు, కోర్టు ట్రయల్స్‌పై పర్యవేక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఐజీ సూచించారు. నేరస్తులకు శిక్ష పడేలా దర్యాప్తు అధికారులు సమర్థవంతంగా పనిచేసే విధంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తన పరిధిలోని పోలీస్ స్టేషన్లను సమర్థవంతంగా పర్యవేక్షిస్తూ సిబ్బందికి సరైన మార్గనిర్దేశం చేయాలని, పెండింగ్ కేసులను తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. నేరాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టడంతో పాటు ప్రజలతో సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.

**ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించాలి :**

ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై సత్వర స్పందన ఇవ్వాలని, పోలీసు సేవలను మరింత మెరుగుపరచాలని ఐజీ సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవడంతో పాటు పోలీస్ స్టేషన్ రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని ఆదేశించారు. సిబ్బంది క్రమశిక్షణతో పాటు వారి సంక్షేమానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఈ తనిఖీలో జిల్లా ఎస్పీ దరావత్ జానకి, డీఎస్పీ వెంకటేశ్వర్లు, భూత్పూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, జిల్లాలోని ఇన్‌స్పెక్టర్లు, భూత్పూర్ సర్కిల్ పరిధిలోని సబ్‌ఇన్‌స్పెక్టర్లు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# సుదీర్ఘ పోలీసు సేవలకు ఘన సన్మానం.. నలుగురు అధికారులకు పదవీ విరమణ వీడ్కోలు

## - 42 ఏళ్ల నుంచి 35 ఏళ్ల వరకు పోలీసు శాఖకు సేవలు.. అభినందించిన జిల్లా ఎస్పీ దరావత్ జానకి

**మహబూబ్‌నగర్, ఆగస్టు 31( ప్రజా జ్యోతి బ్యూరో ):**

పోలీసు శాఖలో సుదీర్ఘకాలం సేవలందించి పదవీ విరమణ పొందిన నలుగురు అధికారులు, సిబ్బందికి మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు శాఖ ఘనంగా వీడ్కోలు పలికింది. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జిల్లా ఎస్పీ దరావత్ జానకి ఆధ్వర్యంలో పదవీ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పదవీ విరమణ పొందిన వారిలో డిస్ట్రిక్ట్ స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ శ్యామ్ సుందర్ 42 సంవత్సరాలు, సీసీఎస్ ఎస్ఐ యాసిన్ 37 సంవత్సరాలు, డీఏఆర్ మహబూబ్‌నగర్ ఏఆర్ఎస్ఐ మద్దలేటి 37 సంవత్సరాలు, నవాబుపేట పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్1288 శ్రీనివాసులు 35 సంవత్సరాలు పోలీసు శాఖలో సేవలందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ జానకి మాట్లాడుతూ పోలీసు శాఖలో సుదీర్ఘకాలం విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవలందించిన పదవీ విరమణ పొందుతున్న అధికారులు, సిబ్బంది సేవలు అభినందనీయమని అన్నారు. విధి నిర్వహణలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ పోలీసు శాఖకు అంకితభావంతో సేవలందించడం గొప్ప విషయమని పేర్కొన్నారు.పదవీ విరమణ ఉద్యోగ జీవితానికి ముగింపు మాత్రమే కాదని, కుటుంబ సభ్యులతో ప్రశాంతమైన, ఆరోగ్యకరమైన, ఆనందకరమైన జీవితాన్ని ప్రారంభించేందుకు ఇది కొత్త అధ్యాయమని ఎస్పీ అన్నారు. పదవీ విరమణ పొందిన వారు పోలీసు శాఖకు అందించిన సేవలను ఎప్పటికీ మరువలేమని, వారి అనుభవం, సేవాభావం ప్రస్తుత సిబ్బందికి స్ఫూర్తిదాయకమని తెలిపారు.అనంతరం పదవీ విరమణ పొందిన అధికారులు, సిబ్బందిని ఎస్పీ శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. వారి సేవలను అభినందిస్తూ ఘనంగా వీడ్కోలు పలికారు. భవిష్యత్ జీవితం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి పదవీ




విరమణ పొందిన వారి కుటుంబ సభ్యులు కూడా హాజరయ్యారు. తమ సహచరుల సుదీర్ఘ సేవలను గుర్తుచేసుకుంటూ పలువురు పోలీసు అధికారులు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్‌బి రత్నం, ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, ఏఓ రుక్మిణి భాయ్, ఎస్పీ సీసీ రామ్‌రెడ్డి, ఆర్ఐలు కృష్ణయ్య, అశోక్ కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ సీనయ్య, ఆఫీస్ సూపరింటెండెంట్లు మధు, బాలరాజు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, పదవీ విరమణ పొందిన వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు వారంలో అక్రిడేషన్లు

## - అర్హులైన ప్రతి ఒక్కరికి అక్రిడేషన్ అందిస్తాం - జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ హామీ

**నాగర్ కర్నూల్ : ఆగస్ట్ 31 (ప్రజా జ్యోతి)**




అక్రిడేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన జర్నలిస్ట్ లకు వారం రోజులలో అక్రిడేషన్ కార్డులు అందిస్తామని కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ హామీ ఇచ్చారు.సోమవారం ప్రజావాణి సమావేశ భవనంలో జిల్లా కలెక్టర్ను తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (హెచ్ 143) యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అబ్దుల్లా ఖాన్, రాష్ట్ర నాయకులు చందు నాయక్,హౌదేకార్ ఉమాశంకర్,తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఖానాపురం ప్రదీప్ ఆధ్వర్యంలో అక్రిడేషన్ కార్డుల విషయమై జిల్లాలోని జర్నలిస్టులతో కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా జర్నలిస్టు అక్రిడేషన్ కార్డుల ఆలస్యంపై కలెక్టర్ తో చర్చించి కొందరు ఉద్దేశపూర్వకంగా అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు అందకుండా ఫిర్యాదులు చేసిఅడ్డుకుంటున్నారని వారి అర్హతకు గుర్తింపు ఇస్తూ అక్రిడేషన్ కార్డులు జారీ చేయాలని, అదేవిధంగా నల్లమల ప్రాంతంలోని మన్ననూర్,దోమలపెంట సెంటర్లలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ప్రత్యేక సర్క్యులర్ ప్రకారం అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని అదేవిధంగా దివ్యాంగుడైన ప్రసాద్ ఫోటో జర్నలిస్టుకు పెన్షన్ వస్తుందన్న ఫిర్యాదుతో అక్రిడేషన్ కార్డును రాకుండా అడ్డుకుంటున్నారని అతను సీనియర్ ఫోటోగ్రాఫర్ గా ఉన్న ఇతనికి అక్రిడేషన్ కార్డును జారీ చేయాలని,అదేవిధంగా ఫ్రీ లాన్స్ జర్నలిస్టులకు అందరికీ అక్రిడేషన్ కార్డులు జారీ చేయాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ జర్నలిస్టుల సమస్యలపై సానుకూలంగా స్పందిస్తూ వారం రోజుల్లో అర్హులైన ప్రతి ఒక్కరికి అక్రిడేషన్ కార్డు అందే విధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు.అనంతరం కలెక్టరేట్ ఆవరణలో యూనియన్ నాయకులు అబ్దుల్లా ఖాన్,చందు నాయక్,శేఖరా చారి, ఖానాపురం ప్ర దీప్,టీజేఏ యూనియన్ నాయకులు మహమ్మద్ దస్తగీర్ మీడియాతో మాట్లాడుతూ ఇప్పటికే నాగర్ కర్నూల్ జిల్లాలో అక్రిడేషన్ కార్డుల జారీ ప్రక్రియ ఆలస్యం అవుతుందని మూడో విడతలో 300 మందికి పైగా దరఖాస్తు చేసుకున్న జర్నలిస్టులు అక్రిడేషన్ కార్డు కోసం ఎదురుచూస్తున్నారన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు అహ్మదు ల్లా ఖాన్,బాలస్వామి,సత్యం,బాబు సాగర్,షేక్ ఫ రీద్ అహ్మద్,షేక్ యాకుబ్ బావజీర్,మల్లిపెద్ది రమేష్,శేఖర్,సునిగిరి సురేష్,మహమ్మద్ సాదిక్,ప్రదీప్ కుమార్,సీనియర్ జర్నలిస్ట్ అంజయ్య, ఫ్రీ లాన్స్ జర్నలిస్టు వనపట్ల సుబ్బయ్య తోపాటు జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన జర్నలిస్టులు,యూనియన్ నాయకులు,ఫోటో,వీడియో,డెస్క్,ఉర్దూ దినపత్రికల జర్నలిస్టులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ బీరం హర్షవర్ధన్‌రెడ్డి 48వ జన్మదిన వేడుకలు

## అభిమానుల సందడితో మార్మోగిన చిన్నంబావి.. పండ్ల పంపిణీ, రక్తదాన శిబిరం, అన్నదానం

## భారీగా తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు.. మాజీ ఎమ్మెల్యేకు శుభాకాంక్షల వెల్లువ

**చిన్నంబావి, ఆగస్టు 31(ప్రజాజ్యోతి)**

మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు బీరం హర్షవర్ధన్‌రెడ్డి 48వ జన్మదిన వేడుకలు చిన్నంబావి మండల కేంద్రంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. వాల్మీకి చౌరస్తా వద్ద నిర్వహించిన వేడుకలకు ఉమ్మడి మండలాల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చారు. దీంతో చిన్నంబావి బీఆర్ఎస్ శ్రేణుల సందడితో మార్మోగింది. ఎటుచూసినా పార్టీ జెండాలు, భారీ  ఫ్లెక్సీలు కార్యకర్తల నినాదాలతో పండుగ వాతావరణం నెలకొంది.

### బైక్ ర్యాలీతో హోరెత్తిన చిన్నంబావి

జన్మదిన వేడుకల్లో భాగంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీగా బైక్ ర్యాలీ, ప్రదర్శన నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ద్విచక్ర వాహనాలతో తరలివచ్చిన కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు. బీఆర్ఎస్ జెండాలు చేతబూని నినాదాలు చేస్తూ ర్యాలీగా తరలివచ్చారు. కార్యకర్తల ఉత్సాహం, భారీ ప్రదర్శనతో చిన్నంబావి మండల కేంద్రం కోలాహలంగా మారింది.

### జన్మదిన వేడుకలు కాదు.. విజయోత్సవంలా!

ఉమ్మడి మండలాల ఇన్‌చార్జి, మాజీ సర్పంచ్ గోవిందు శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సోమేశ్వరమ్మ, మాజీ జెడ్పీటీసీ వెంకటరమణమ్మ చిన్నారెడ్డి మండల కార్యకర్తల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. భారీ కేక్‌ను కట్ చేసి బీరం హర్షవర్ధన్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు.ఈ సందర్భంగా పలువురు బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. బీరం హర్షవర్ధన్‌రెడ్డి జన్మదిన వేడుకలను చూస్తుంటే ఇది కేవలం జన్మదిన వేడుకలా కాకుండా విజయోత్సవంలా కనిపిస్తోందని అన్నారు. పనుల సీజన్ అయినప్పటికీ వివిధ గ్రామాల నుంచి కార్యకర్తలు, అభిమానులు స్వచ్ఛందంగా భారీగా తరలిరావడం ఆయనపై ఉన్న అభిమానం, ప్రజాదరణకు నిదర్శనమన్నారు.వచ్చే ఎన్నికల్లో బీరం హర్షవర్ధన్‌రెడ్డి గెలుపు ఏ స్థాయిలో ఉండబోతుందో ఈ జన్మదిన వేడుకలకు తరలివచ్చిన జనసందోహమే చెబుతోందని అన్నారు. ఇప్పటికే ఆయన ఎమ్మెల్యేగా గెలిచినట్టుగా కార్యకర్తల్లో ఉత్సాహం కనిపిస్తోందని పేర్కొన్నారు.

### అభివృద్ధిపై ప్రభుత్వాన్ని నిలదీసిన బీఆర్ఎస్ నేతలు

మండలంలో అభివృద్ధి కుంటుపడిందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని అన్నారు.బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రైతుల సాగునీటి సమస్యలకు ప్రాధాన్యం ఇచ్చి పరిష్కారానికి కృషి చేశారని గుర్తుచేశారు. ప్రస్తుతం రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు రుణమాఫీ, మహిళలకు ఆర్థిక సాయం, పింఛన్లు, వికలాంగుల సంక్షేమం తదితర అంశాల్లో ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

### సేవా కార్యక్రమాలతో ఆదర్శంగా

జన్మదిన వేడుకలను పురస్కరించుకుని పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పండ్ల పంపిణీ, రక్తదాన శిబిరం, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. రక్తదాన శిబిరంలో యువకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదాతలను నాయకులు అభినందించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించి పలువురికి భోజనం అందించారు.

### గ్రామాల నుంచి భారీగా తరలివచ్చిన శ్రేణులు

పెద్దదగడ, అమ్మాయి పల్లి,పెద్దమారురు్, చెల్లెపాడు, చిన్నమారు, కొప్పునూరు, లక్ష్మిపల్లి, వెల్టూరు, గూడెం, బెక్కెం, అయ్యవారిపల్లి, తదితర గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. బైక్ ర్యాలీతో పాటు భారీ ప్రదర్శన నిర్వహించడంతో వాల్మీకి చౌరస్తా పరిసరాలు సందడిగా మారాయి. పనుల సీజన్‌లోనూ స్వచ్ఛందంగా తరలివచ్చిన కార్యకర్తలను నాయకులు అభినందించారు.బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవిస్తూ మరింత ప్రజాసేవ చేయాలని నాయకులు, కార్యకర్తలు ఆకాంక్షించారు. ఆయన నాయకత్వంలో పార్టీ శ్రేణులు మరింత ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారుఈ కార్యక్రమంలో పెద్దమారు మాజీ సర్పంచ్ గోవిందు శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సోమేశ్వరమ్మ, మాజీ జెడ్పీటీసీ వెంకటరమణమ్మ చిన్నారెడ్డి, తగరం లక్ష్మి కురుమయ్య, చెల్లపాడు సర్పంచ్ పెద్ద నరసింహ, చిన్నమారు సర్పంచ్ మద్దూరి శంకర్, మాజీ సర్పంచ్ రంజిత్‌కుమార్, మండల నాయకులు వడ్డేమాన్ బిచ్చన్న, సంకటి మద్దిలేటి, సంపంగి మద్దిలేటి, మహేష్‌రెడ్డి, అయ్యవారిపల్లి మద్దిలేటి, స్వామి, బోరెల్లి బిచ్చన్న, వై.స్వామి, దేగ శేఖర్, వరమల ప్రకాష్, మాజీ ఎంపీపీ చెల్లపాడు సులిగిరి తిరుపతయ్య, బిచ్చన్న, బాబు నరసింహ, గూడెపు శివారెడ్డి, కాలూరు మహేష్‌రెడ్డి, చల్ల మధు, రిటైర్డ్ టీచర్ ఈశ్వర్‌రెడ్డి, కృష్ణమూర్తి, వరంగల్ శ్రీనివాస్‌రెడ్డి, శంకర్, వెంకట్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్, సింగరాజుల బీసన్న, నాగశేషులు, సాయిబాబు, బుడ్డయ్య, మద్దిలేటి, శ్రీనివాసులు, స్వామినాయుడు, శేఖర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. బీరం హర్షవర్ధన్‌రెడ్డి జన్మదిన వేడుకలు, బైక్ ర్యాలీ, భారీ ప్రదర్శనతో చిన్నంబావి మండలంలో బీఆర్ఎస్ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది. అభిమానులు, కార్యకర్తల భారీ హాజరుతో వేడుకలు విజయవంతమయ్యాయి.








# ప్రధానమంత్రి దన్ ధాన్య యోజన పనులను లక్ష్యాల మేరకు పూర్తి చేయాలి

## - నిధుల వినియోగంపై కేంద్ర వ్యవసాయ శాఖ జాయింట్ సెక్రటరీ నితిన్ సమీక్ష

## - మార్గదర్శకాలకు అనుగుణంగా పథకం అమలు - జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్





**నాగర్ కర్నూల్ : ఆగస్ట్ 31 (ప్రజా జ్యోతి)**

ప్రధానమంత్రి దన్ ధాన్య యోజన పథకం కింద జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల పు రోగతి,నిధుల వినియోగంపై కేంద్ర వ్యవసాయ శా ఖ జాయింట్ సెక్రటరీ టీ.నితిన్ ఢిల్లీ నుండి జిల్లా కలెక్టర్లతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు.నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా పథకం కింద 11 శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న పనులు,వాటి పురోగతి,కేటాయించిన నిధుల వినియోగం,శాఖల వారీగా నిర్దేశించిన లక్ష్యాలు, ఇప్పటివరకు సాధించిన ప్రగతి తదితర అంశాల్ని కేంద్ర జాయింట్ సెక్రటరీ జిల్లా కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లాలో ప్రధానమంత్రి దన్ ధాన్య యోజన కింద చేపడుతున్న కార్యక్రమాలు,ఇప్పటివరకు సాధించిన పురోగతి,సంబంధిత శాఖలు అమలు చేస్తున్న పనులు,నిధుల వినియోగానికి సంబంధించిన వివరాలను కేంద్ర జాయింట్ సెక్రటరీకి కలెక్టర్ వివరించారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ప్రధాన మంత్రి దన్ ధాన్య యోజనకింద జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను శాఖల వారీగా సమన్వయంతో పూర్తి చేయాలని,పథకం అమలులో భాగస్వామ్యమవుతున్న 11 శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని,చేపట్టిన ప్రతి పనిని నిర్దేశిత గడువులో పూర్తి చేసి కేంద్ర ప్రభుత్వ వెబ్ సైట్లు అప్లోడ్ చేయాలని, మంజూరైన నిధులను ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకనుగుణంగా పూర్తిస్థాయిలో,పారదర్శకంగా,సద్వినియోగం చేయాలన్నారు. ఈ పథకం ద్వారా జిల్లాలో రైతులకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరేలా కార్యక్రమాల అమలుకు ప్రాధాన్యత ఇవ్వాలని,వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతులకు మౌలిక సదుపాయాల కల్పన,వ్యవసాయ ఉత్పాదకత పెంపు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. శాఖల వారీగా చేపట్టిన పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, నిర్దేశించిన లక్ష్యాల సాధనలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని,పథకం అమలువివరాలను సక్రమంగా నమోదు చేసి,అవసరమైన నివేదికలను నిర్ణీత సమయంలో సమర్పించాలని జిల్లాలో ప్రధానమంత్రి దన్ ధాన్య యోజనను సమర్థవంతంగా అమలు చేసి,పథకం ద్వారా రైతులకు గరిష్ఠ ప్రయోజనం కల్పించేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ అన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖ అధికారి చంద్రశేఖర్,హార్టికల్చర్ అధికారి వెంకటేశం,శాఖల అధికారులు పాల్గొన్నారు.

# చిన్నంబావిలో ప్రజావాణికి 9 దరఖాస్తులు

**చిన్నంబావి ఆగస్టు 31 (ప్రజా జ్యోతి)**

మండలంలో సోమవారం నిర్వహించిన 'ప్రజావాణి' కార్య క్రమానికి మొత్తం తొమ్మిది దరఖాస్తులు నమో దయ్యాయి. శాఖలవారీగా చూస్తే రెవెన్యూ శాఖకు పింఛన్లకు సంబంధించి దరఖాస్తులు, వివిధ శాఖకు, శ్రీశైలం 98 జీవో నిర్వాసితుల దరఖాస్తు అందింది. ప్రజలు తమ సమస్యలను అధి కారుల దృష్టికి తీసుకురాగా, సంబంధిత శాఖల అధికారులు దరఖాస్తులను పరిశీలిం చి నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కా ర్యక్రమంలో ఎంపీడీవో సుర్ణ ఆదర్శ్ గౌడ్ , తహశీల్దార్ శ్రీనివాస్, ఎంపీఓ రామస్వామి, ధనుంజయ రాజు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# భూ రీసర్వే పనులను వేగవంతం చేయాలి

- 22ఏ,రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి - పాత,ప్రస్తుత డేటాను పోల్చి వివరాలు సిద్ధం చేయాలి

- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

**నాగర్ కర్నూల్ : ఆగస్ట్ 31(ప్రజా జ్యోతి)**



భూ రీసర్వే పనులను వేగవంతం చేయడంతో పా టు 22ఏ కింద నిషేధిత భూముల వివరాలు,రె వెన్యూ శాఖకు సంబంధించిన పెండింగ్ సమస్యలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి,నిబంధనల ప్రకారం పరిష్కరించాలని పాత భూ రికార్డులు,ప్రస్తుతం భూ భారతి,×+=ా లో నమోదైన వివరాలను పరస్పరం పోల్చి తేడాలు లేకుండా ఖచ్చితమైన డేటాను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి రెవెన్యూ అదనపు కలెక్టర్ చెన్నయ్య,జిల్లా రెవిన్యూ అధికారి పాండులతో క లిసి కల్వకుర్తి,నాగర్‌కర్నూల్,అచ్చంపేట,కొల్లాపూర్ రెవెన్యూ డివిజన్ల ఆర్డీవోలు,మండలాల తహసీల్దార్లతో భూ రీసర్వే,22ఏ,రెవెన్యూ శాఖకు సంబంధించిన వివిధ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి భూ రీసర్వే పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని,రీ సర్వేలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి,సంబంధిత రికార్డులను పరిశీలిస్తూ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని,22ఏ కింద నిషేధిత భూముల కు సంబంధించిన వివరాలను పరిశీలించి భూ–భారతి,×+=ాలో నమోదైన వివరాలను పాత రెవెన్యూ రికార్డులతో పోల్చి,వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ఖచ్చితమైన సమాచారాన్ని సిద్ధం చేయాలన్నారు.డిసెంబర్ 2025కు ముందు ఉన్న భూముల డేటాను ప్రస్తుతం భూ భారతి, ×+=ా తదితర రికార్డుల్లో నమోదైన వివరాలతో పోల్చి, విస్తీర్ణంలో వచ్చిన తేడాలను కేటగిరీల వారీగా గుర్తించాలని,గ్రామాల వారీగా భూముల వివరాలను సమగ్రంగా పరిశీలించి,పునరావృతమైన విస్తీర్ణాన్ని గుర్తించి మినహాయించడంతో పాటు వ్యవసాయ, వ్యవసాయేతర భూములను వేర్వేరుగా గుర్తించాలని, పాత రికార్డుల ప్రకారం ఉన్న విస్తీర్ణం ఎంత, ప్రస్తుతం విస్తీర్ణం ఎంత అనే వివరాలను స్పష్టంగా పొందుపరుస్తూ వ్యవసాయ,వ్యవసాయేతర భూముల డేటాను ప్రత్యేకంగా సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.వ్యవసాయ, వ్యవసాయేతర భూములను సంబంధిత కేటగిరీల వారీగా వర్గీకరించి,ప్రభుత్వ భూములు,పట్టా భూములు, ప్రైవేటు భూములు ఎంత ఉన్నాయో స్పష్టంగా గుర్తించాలని,ముఖ్యంగా ౹ాాదీ కింద నమోదైన భూముల్లో ప్రభుత్వ, పట్టా భూముల వివరాలను మండలాల వారీగా పరిశీలించి నివేదిక సిద్ధం చేయాలని సూచించారు.వ్యవసాయేతర భూముల విషయంలో వాస్తవ రికార్డులు,భూ భారతి డేటా,సంబంధిత రెవెన్యూ రికార్డులను పోల్చి పరిశీలించాలని,అటవీ,ఇరిగేషన్ భూములు,చెరువులు తదితర భూములను నిబంధనలకనుగుణంగా సంబంధిత కేటగిరీల్లోనే నమోదు చేయాలని స్పష్టం చేశారు.భూ భారతి వ్యవస్థలో రికార్డుల సవరణకు నిర్దిష్ట ప్రక్రియలు అందుబాటులో ఉన్నందున,తప్పుగా నమోదైన వివరాలను సంబంధిత ఆధారాలతో పరిశీలించి నిబంధనల ప్రకారం సరిచేయాలని కలెక్టర్ తెలిపారు.నిషేధిత జాబితాలో తప్పుగా నమోదైన భూముల విషయంలో అందుబాటులో ఉన్న రికార్డులు,ఆధారాలను క్షుణ్ణంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రెవెన్యూ ఆదేశించారు.

# పౌర హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత: తహశీల్దార్ శ్రీనివాస్

## - స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావాన్ని పాటించాలి

**చిన్నంబావి,ఆగస్టు 31 (ప్రజా జ్యోతి)**






చిన్నంబావి మండలం పెద్దమారూర్ గ్రామంలో పౌర హక్కుల దినోత్సవాన్ని ఘనంగా సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం వంటి రాజ్యాంగ విలువలపై అధికారులు గ్రామస్తులకు అవగాహన కల్పించారు.కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ కేతాపగ జయమ్మ లక్ష్మయ్య హాజరయ్యారు. ఉపసర్పంచ్ నరేష్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీవో రామస్వామి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, టీఏ ఈశ్వర్, జీపీవో శ్రీశైలం, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మండల తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. కుల, మత, వర్గ వివక్షకు తావులేకుండా ప్రతి ఒక్కరూ సమానత్వంతో జీవించాలని సూచించారు. రెండు గ్లాసుల పద్ధతి, ఆలయ ప్రవేశంలో వివక్ష వంటి సామాజిక వివక్షతలకు పాల్పడరాదని స్పష్టం చేశారు. ఇలాంటి వివక్షాపూరిత చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### బాల్య వివాహాలను అరికట్టాలి

బాల్య వివాహాలపై అధికారులు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలు నిండని బాలికలకు వివాహాలు చేయరాదని సూచించారు. బాల్య వివాహాలకు పాల్పడితే సంబంధిత తల్లిదండ్రులు, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు గ్రామ ప్రజలు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

### ఓటు హక్కును కోల్పోకుండా జాగ్రత్తలు

ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఓటరు జాబితా సవరణలో భాగంగా ఎస్ఐఆర్ నోటీసులు అందుకున్న వారు తప్పనిసరిగా అధికారులకు తగిన ఆధారాలతో సమాధానం ఇవ్వాలని సూచించారు. నోటీసులకు స్పందించకపోతే ఓటు హక్కు కోల్పోయే అవకాశం ఉందని తెలిపారు.పెద్దమారూర్ గ్రామంలో సుమారు 718 మంది ఓటర్ల ఓట్లు తొలగిపోయే అవకాశం ఉందని తహసీల్దార్ తెలిపారు. ఓటు హక్కు కోల్పోకుండా ఉండేందుకు నోటీసులు అందుకున్న వారు బ్యాంకు ఖాతా వివరాలు, జాబ్ కార్డు లేదా ఇతర అర్హత పత్రాలను అధికారులకు సమర్పించాలని సూచించారు.అవసరమైన సందర్భంలో ఆధార్ కార్డును కూడా ఆధారంగా అందించాలని కోరారు.రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులను ప్రతి ఒక్కరూ తెలుసుకుని, ఇతరుల హక్కులను గౌరవించాలని అధికారులు సూచించారు. సమాజంలో వివక్షకు తావులేకుండా స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావంతో జీవించడమే రాజ్యాంగ స్ఫూర్తి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ తో పాటు ఎంపీఓ రామస్వామి, గ్రామ సర్పంచ్ జయమ్మ, ఉపసర్పంచ్ నరేష్, మాజీ సర్పంచ్ కల్వకోల్ ఉషనయ్య, జిపిఓ శ్రీశైలం, పంచాయత్ సెక్రెటరీ బి శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్ జీవన్, కే లక్ష్మయ్య, అంగన్వాడీ టీచర్లు కే గోవిందమ్మ, బి గోవిందమ్మ,అరుణ, తెలుగు కృష్ణయ్య, బాలకృష్ణ, బాలస్వామి, చంద్రయ్య,మల్టీపర్పస్ వర్కర్లు రామకృష్ణ, పద్మ, ఎల్లయ్య, రాజేశ్వరి, శ్రీనివాసులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు